### జల మార్గాల్లో ఇబ్బంది జరిగితే..
## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలు



04


E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 15-04-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:103 || పేజీలు–6 www.ekaburu.com


## దక్షిణాది రాష్ట్రాలు
# నష్టపోతాయి



- డీలిమిటేషన్ వల్ల ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్లు తగ్గే అవకాశం
- దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలి
- ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసి చూపించాం; సిఎం రేవంత్ రెడ్డి

**ఈ కబురు, హైదరాబాద్ :**

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రొరేటా ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలు నష్టపోతాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమ లక్ష్యం రాజ్యాధికారం సాధించడమే అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి , మంత్రులు ప్రజాప్రతినిధులతో కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఆ మహనీయుడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. "పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ . మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోంది.

మిగతా 2లో

## రేవంత్ రెడ్డి యాంటీ అంబేడ్కర్

- జాగృతి కార్యాలయంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అంబేడ్కర్ బిక్షే ;కవిత చేసి చూపించాం; సిఎం రేవంత్ రెడ్డి



02

## నారీ నీకు
# వందనం



**ఈ కబురు ;**

"......దేశ రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేస్తోంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన కసరత్తు సాకారమయ్యే తరుణం వచ్చేసింది. మహిళా రిజర్వేషన్లను 2029 ఎన్నికల నాటి నుంచే అమల్లోకి తేవడం కోసం పార్లమెంటు ప్రత్యేకంగా సమావేశం కాబోతోంది. ....."

**దశాబ్దాల కల..**


మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆలోచన ఇప్పటిది కాదు. ఈ ఆలోచన వెనక దాదాపు నాలుగున్నర దశాబ్దాల చరిత్ర ఉంది. తొలిసారి 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. అప్పుడే లోక్‌సభ, శాసనసభల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఆలోచనకు బీజం పడింది. 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ ఆమోదం పొందలేదు. తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ అదే పరిస్థితి. చివరకు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయింది. 2014లో లోక్‌సభ రద్దవ్వడంతో మరోసారి బిల్లు మురిగిపోయింది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ బిల్లును తెరపైకి తెచ్చి.. 2023లో ఆమోదించారు.

**——అత్యంత వేగంగా..**

కేంద్ర ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రకారం 33% మహిళా రిజర్వేషన్లు 2034 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. ఎందుకంటే ఆ బిల్లులో పేర్కొన్న ఆర్టికల్ 334(ఏ) ప్రకారం.. మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ రిజర్వేషన్లు అమల్లోకి రావాలి. ఆ నిబంధన ప్రకారం జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం 2027 మార్చి నెలకు పూర్తవుతుంది. ఆ తర్వాత దాని లెక్కలు ప్రచురించాల్సి ఉంటుంది. అనంతరం పునర్విభజన కమిషన్ ఏర్పాటుచేయాలి. తదనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి.. ఈ పనులన్నీ 2029 ఎన్నికల్లోపే పూర్తికావు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణ ప్రకారం.. కొత్త జనగణన జరిగే వరకు వేచి చూడక్కర్లేదు. నాటి ఆర్టికల్‌ను సవరించి... 2011 జనాభా లెక్కల ఆధారంగానే కసరత్తును పూర్తిచేయడానికి ప్రభుత్వం ఇప్పుడు సమాయత్తమయింది. తదనుగుణంగా 2029 ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లూ అమలవుతాయి.

మిగతా 2లో

## ఇకపై లోక్‌సభలో
# 850 స్థానాలు..?



**ఈ కబురు : నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది.**

మిగతా 2లో



6

### కోల్ కతా చిత్తు.. చెన్నై విక్టరీ

హ్యాట్రిక్ ఓటములతో ఐపీఎల్-19ను పేలవంగా ఆరంభించిన చెన్నై సూపర్‌కింగ్స్.. కొంచెం ఆలస్యంగా జోరందుకుంది. గత మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్‌ను మట్టికరిపించిన సీఎస్కే.. మంగళవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై అలవోకగా గెలిచింది. బ్యాటింగ్ కొంచెం కష్టంగా సాగిన చెపాక్ స్టేడియంలో బ్యాటర్ల సమష్టి ప్రదర్శనతో 192 పరుగులు చేసిన చెన్నై.. ప్రత్యర్థిని 160/7కే కట్టడి చేసింది. స్పిన్నర్ నూర్ అహ్మద్ కోల్‌కతా పతనాన్ని శాసించాడు. వర్షం వల్ల ఖాతాలో చేరిన ఒక్క పాయింట్ మినహాయిస్తే.. అయిదో మ్యాచ్‌లోనూ కేకేఆర్ సొంతంగా పాయింట్ సాధించలేకపోయింది.



4

### తెలంగాణలో తారెత్తిస్తున్న ఎండలు

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. రాష్ట్రంలో వివిధ చోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.



### ఆర్టీసీలో సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: మంత్రి పొన్నం

02

**ఈ కబురు, హైదరాబాద్:**

ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

### లక్షలాది మందిని
#### క్వాంటం నిపుణులుగా తీర్చిదిద్దుతాం



ఈ కబురు, అమరావతి:

రాష్ట్రంలోని 45 లక్షల మందిని ఏఐ, క్వాంటం, సైబర్ డేటా సెక్యూరిటీలో నిపుణులుగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సాంకేతికతను అనుసరించడమే కాకుండా దానిని ఆవిష్కరించే స్థాయికి ఏపీ ఎదిగేలా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ప్రతి పౌరుడికి ఏఐ లాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీ, గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను ఎస్ఆర్ఎం వర్సిటీ నుంచి ఆయన ప్రారంభించారు.

04

### కాంగ్రెస్‌ను ఎదుర్కొందాం..
#### ..కేసీఆర్ నినాదంతో ముందుకెళ్దాం.. కేడర్‌కు కేటీఆర్ పిలుపు!



**ఈ కబురు, హైదరాబాద్ ;**

కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలను అడుగడుగునా ఎదుర్కొందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. తెలంగాణ భవన్ లో అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఆయన నిర్వహించారు.

04

### కసి, పట్టుదలే మనల్ని..
## ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి



**...సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించండి**

ఈ కబురు, ఉండవల్లి:

కసి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం నేపాల్ ఎవరెస్ట్ శిఖర అధిరోహణ యాత్ర చేపట్టడం దేశంలో ఇదే తొలిసారి. 21 మంది విద్యార్థుల బృందం ఈ నెల ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు 16 రోజుల పాటు ఈ సాహసయాత్ర చేయనుంది. 5,364 మీటర్ల ఎత్తులోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను ప్రభుత్వ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు అధిరోహించనున్నారు. వీరిలో 8 మంది బాలికలు ఉన్నారు. 15వ తేదీన మధ్యాహ్నం విద్యార్థుల బృందం నేపాల్ రాజధాని ఖాట్మండూకు చేరుకోనుంది. అక్కడి నుంచి ఈ ఎవరెస్ట్ పర్వతారోహణ సాహసయాత్ర ప్రారంభం కానుంది.

మిగతా 2లో



### ప్రధానికి సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

02

ఈ కబురు, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ..




## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

- .. 40 నిమిషాలపాటు సంభాషణ
- ట్రంప్‌మోదీ ఫోన్ సంభాషణకు ప్రాధాన్యం
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై చర్చ
- హర్మూజ్ జలసంధి భద్రత కీలకం
- భారత్‌అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం
- ఇరాన్‌అమెరికా శాంతి చర్చల విఫలం ప్రభావం

02

### వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా:
## ప్రధాని మోదీ



03

## ఇకపై లోక్‌సభలో 850 స్థానాలు..?



ఆ ప్రతులను వారికి పంపింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెంచనున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం.

--సమావేశం కానున్న ఇండియా కూటమి..

నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై బుధవారం ఇండియా కూటమి నేతలు భేటీకానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై సమాచారం అందిన నేపథ్యంలో.. వాటిపై చర్చించనున్నారు.

## రేవంత్ రెడ్డి యాంటీ అంబేడ్కర్



ఈ కబురు, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాంటీ అంబేడ్కర్ అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ భూమి మీద ఎవరైనా అంబేడ్కర్ వ్యతిరేకి ఉన్నారంటే అది రేవంత్ రెడ్డే మాత్రమేనని అన్నారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, బాబా సాహెబ్ జయంతి సందర్భంగానైనా ఈ ముఖ్యమంత్రికి బుద్ధి వచ్చి పేదలకు న్యాయం చేసే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక ఐడియాలజీ, ఒక థాట్ అని చెప్పారు. మహిళలు అభివృద్ధి చెందితేనే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన బాబా సాహెబ్ మహిళల కోసం ఎంతో చేశారని గుర్తు చేశారు.

--తెలంగాణ రాష్ట్రం అంబేడ్కర్ భిక్ష

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందంటే అది బాబా సాహెబ్ అంబేడ్కర్ పెట్టిన భిక్ష అని కవిత గుర్తు చేశారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 3 అనే శక్తి లేకపోయి ఉంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది సాధ్యమయ్యేదే కాదని అన్నారు. సోషలిజం వర్ధిల్లాలని అంబేడ్కర్ కాంక్షించే వారని, దురదృష్టవశాత్తు తెలంగాణలో ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ దళితులు, మహిళలపై ఇంకా ఆకృత్యాలు పెరిగిపోవటం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ కట్టినా సరే దళితులకు చెందిన అసైన్డ్ భూములనే ప్రభుత్వాలు లాక్కుంటున్నాయన్నారు. వెలుగుమట్లలో అదే చేశారని...ఇప్పుడు పరిగిలో కూడా 12 వందల ఎకరాలు సేకరిస్తే అందులో వెయ్యి ఎకరాలు అసైన్డ్ భూములేనని ఆవేదన వ్యక్తం చేశారు. బాబా సాహెబ్ అంటేనే ధైర్యమని ఆయన ఇచ్చిన ధైర్యంతో పేదల పక్షాన ఈ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చెప్పారు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో మరిన్ని ఉద్యమాలు వచ్చి ప్రజల కష్టాలన్నీ తొలగిపోవాలని అన్నారు.

## ఆర్టీసీలో సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: మంత్రి పొన్నం

ఈ కబురు, హైదరాబాద్:

ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు సంబంధించిన అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని.. ఈ రెండు అంశాలు తప్ప మిగతా సమస్యలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ అమలులోకి తీసుకువచ్చామని.. ప్రస్తుతం ఎలాంటి డీఏ బకాయిలు పెండింగ్‌లో లేవన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ అంశం కూడా ఆలోచిస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

## ప్రధానికి సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

ఈ కబురు, హైదరాబాద్:

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్ట వద్దన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని కోరారు. "కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతిస్తుంది. తక్షణమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలి. పెంచాలనుకుంటున్న 272 లోక్‌సభ సీట్లలో 50 శాతం అంటే..136 ప్రోరేటా(జనాభా ప్రాతిపదికన), మిగిలిన 50శాతం (136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఆర్థికవృద్ధి రేటు ఆధారంగా పునర్విభజన చేయాలి" అని రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. ఇదే అంశంపై దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులకు కూడా సీఎం రేవంత్‌రెడ్డి విడివిడిగా లేఖలు రాశారు.

## మహిళా పోలీసులు

### పెరిగాక శాఖ పనితీరులోనూ మార్పు: డీజీపీ

ఈ కబురు, ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పోలీసుశాఖలో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించి అమలు చేస్తున్నారు. సివిల్ విభాగంలో 30 శాతం, ఏఆర్‌లో 20 శాతం చొప్పున వారే ఉండేలా చర్యలు చేపట్టాం. ఉద్యోగినులు పెరిగాక శాఖ పనితీరులోనూ మార్పు సుస్పష్టమైంద''ని డీజీపీ బి.శివధర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలోని బ్రీఫింగ్‌హాల్‌లో 'పోలీసు అక్క'లతో మాటామంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పలు కీలక విభాగాల్లో మహిళలు అధికారులుగా రాణిస్తున్నారని చెప్పారు. అతివలకు అవకాశం కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయనేందుకు ఇది నిదర్శనమన్నారు. మహిళల్లోనూ ఆత్మస్థైర్యం పెరుగుతోందని, సమాజాన్ని చూసే కోణం మారుతోందని తెలిపారు.

* నిర్మల్ జిల్లాలో ప్రారంభించిన 'పోలీసు అక్క' కార్యక్రమానికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం అభినందనీయమని, ఇది రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీజీపీ చెప్పారు. పోలీసు అక్క, నారీశక్తి, సివంగి.. ఇలా మహిళలే కేంద్రంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారు. ప్రజలు, విద్యార్థులతో మమేకమవుతూ వారిలో ధైర్యం, భరోసా పెంపొందించేలా సమర్థంగా పనిచేయాలని సూచించారు. వీటి అమలుతీరుపై మహిళా ఉద్యోగుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

* నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని డీజీపీ ప్రారంభించి, ఆవరణలో మొక్క నాటారు. పోక్సో కేసుల బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ విభేదాలతో విడిపోయి, భరోసా చొరవతో మళ్లీ ఏకమైన జంటలకు ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు. ఎస్పీ జానకిషర్మిల, నిర్మల్, భైంసా సహాయ ఎస్పీలు సాయికిరణ్, రాజేశ్‌మీనా తదితరులు పాల్గొన్నారు. సోన్ మండల కేంద్రంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలోనూ డీజీపీ పాల్గొన్నారు.

# నారీ నీకు వందనం



--ఈ సమావేశాల్లో ఏం జరగనుంది?

ప్రత్యేక సమావేశాల్లో నారీ శక్తి వందన్ అధినియమ్ చట్టానికి సంబంధించిన రాజ్యాంగ (సవరణ) బిల్లు 2026, నియోజకవర్గాల పునర్విభజన (సవరణ) బిల్లు 2026, కేంద్రపాలిత ప్రాంతాల మహిళా రిజర్వేషన్లను విస్తరిస్తూ ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనుంది. ఇది రాజ్యాంగ సవరణ బిల్లు కాబట్టి పార్లమెంటు ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ తప్పనిసరి. అంటే ప్రభుత్వానికి విపక్షాల మద్దతు కీలకం. అంతేకాదు.. రాజ్యాంగంలోని అధికరణం 368(2) ప్రకారం దేశంలోని మొత్తం రాష్ట్రాల్లో సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదించాలి.

--సీట్లు పెరుగుతాయా: నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ద్వారా లోక్‌సభ సీట్ల సంఖ్య 816కు పెరుగుతుంది. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వ్ అవుతాయి.

--విపక్షాల అభ్యంతరమేంటి

ఇవి మహిళా రిజర్వేషన్ల అమలుకు ఉద్దేశించిన సమావేశాలు కావని, నియోజకవర్గాల సంఖ్యను పెంచడం కోసం ఏర్పాటుచేస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. 2023లో చేసిన చట్టంపై ఇన్నాళ్లు మౌనంగా ఉండి ఇప్పుడు హడావిడిగా ప్రభుత్వం ఎందుకు సవరణలు చేస్తోందని ప్రశ్నిస్తున్నాయి.

--ప్రభుత్వం ఏమంటోంది

ప్రస్తుత చట్టం ప్రకారం మహిళా రిజర్వేషన్ల అమలుకు సుదీర్ఘ సమయం పడుతుందని.. వేగంగా రిజర్వేషన్ ఫలాలందాలంటే ఈ సవరణలు తప్పనిసరని ప్రభుత్వమంటోంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే 2029 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలవుతాయని చెబుతోంది.

--బిల్లు పేరు: నారీ శక్తి వందన్ అధినియమ్

ఎప్పుడు ఆమోదించారు?

2023 సెప్టెంబరు 20న (28న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదముద్ర)

చట్టం పేరు: 106వ రాజ్యాంగ సవరణ చట్టం

ఎంత శాతం: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు

ఎస్సీ/ఎస్టీ కోటా: ఇప్పటికే రిజర్వ్ అయిన ఎస్సీ, ఎస్టీ సీట్లలో కూడా మహిళలకు 33 శాతాన్ని కేటాయిస్తారు.

కాల పరిమితి: ఆరంభంలో 15 ఏళ్లపాటు రిజర్వేషన్లు అమలులో ఉంటాయి. ఆ తర్వాత అవసరమైతే పార్లమెంటు వీటిని పొడిగించొచ్చు.

ఎప్పట్నుంచి అమలు: 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలుకు వీలుగా చట్ట సవరణ చేస్తున్నారు.

దేనికి వర్తించదు: మహిళా రిజర్వేషన్ల చట్టం రాజ్యసభకు, రాష్ట్రాల శాసనమండళ్లకు వర్తించదు.

# దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి



జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారు. అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని చెబుతున్నారు. ఆ ప్రాతిపదిక ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాలను పెంచుతుంది. దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయి. ఏ లెక్కన దక్షిణాది కోటాను తగ్గిస్తారు" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల పెంపుపై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వం మాది. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసి చూపించిన రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే. కులగణన చేస్తామని చెప్పాం. చేసి చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. మంచి పనికి తెలంగాణ ప్రభుత్వం ముందుంటుంది. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన మాటలు ఆచరణలోకి రావాలంటే మన సీట్లను సాధించుకోవాలి. అప్పుడే మన హక్కుల కోసం మాట్లాడగలం. మేధావులు ఆలోచన చేయాలి" అని కోరారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించవచ్చని మార్గదర్శకం చేసిన మహానాయకుడు అంబేడ్కర్ . విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి మనల్ని విముక్తి చేస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని, సమాజంలో సరైన గౌరవం దక్కుతుందని బలంగా విశ్వసించారు. అంబేడ్కర్ ఆలోచనే ప్రజాపాలన విధానం. రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మగాంధీ గారు ప్రపంచ దేశాలకు చాటిచెబితే, ఆ దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించవచ్చని నిరూపించిన వారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గారు. ఈ దేశానికి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెండు కళ్లలాంటి వారు. భారత రాజ్యాంగంలో అంబేడ్కర్ జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది. తెలంగాణ ఉద్యమంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలే ముందు భాగంలో నిలిచి పోరాటం చేశారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దరన్న, మారుమూల పల్లెల్లో జయ జయహే తెలంగాణను మారుమోగించిన అందెశ్రీ గార్లను" ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. దళిత, గిరిజన సామాజిక వర్గానికి మంత్రిపదవులు, ఇతర పదవులు, అధికారులకు ప్రాధాన్యత విషయాల్లో గత ప్రభుత్వాలకు, ప్రజాప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను పోల్చుకోవాలని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలోనే అత్యధిక ప్రాధాన్యత దక్కిందని అనేక ఉదాహరణలు చెప్పారు. కులాల మధ్య విభజన జరుగుతుందని, సమాజంలో మరింతగా అంతరాలు పెరుగుతున్నాయని ఆలోచన చేసి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. దేశానికి భవిష్యత్తును అందించే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పేదలకు నాణ్యమైన విద్య అందడం లేదని, నాణ్యమైన విద్యను అందించడానికి అంబేడ్కర్ గారి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. "రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చాం. 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తే అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఉద్యోగాలొచ్చాయి. సివిల్ సర్వీసెస్‌లో ప్రోత్సహించాలని రాజీవ్ గాంధీ అభయహస్తం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఒకవైపు అప్పులు, తప్పులను సవరిస్తూనే రాష్ట్రంలో పరిపాలనను చక్కబెడుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఈ ప్రభుత్వం మనది. ప్రజల కోసం అందిస్తున్న ప్రజాపాలనను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉంది" అని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , ధనసరి అనసూయ సీతక్క , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ మరియు డొనాల్డ్ ట్రంప్ మధ్య కీలక టెలిఫోన్ సంభాషణ చోటుచేసుకుంది. దాదాపు 40 నిమిషాల పాటు కొనసాగిన ఈ చర్చలో ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ పరిణామాలు, అలాగే భారత్‌అమెరికా సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా చమురు రవాణాకు కీలక మార్గమైన హర్మూజ్ జలసంధి భద్రతపై ఇరు దేశాధినేతలు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ జలసంధి మూసివేయబడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, అక్కడ భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం అత్యంత అవసరమని మోదీ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, సముద్ర మార్గాల్లో నిరంతర రవాణా కొనసాగేందుకు అంతర్జాతీయ సహకారం అవసరమని కూడా పేర్కొన్నారు. ఇదే సమయంలో భారత్‌అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై కూడా ఇరు నేతలు సమీక్షించారు. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, భద్రత వంటి పలు రంగాల్లో ఇప్పటికే మంచి సహకారం కొనసాగుతోందని, భవిష్యత్తులో ఈ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలని సంకల్పించారు. ప్రధాని మోదీ తన ప్రకటనలో, ప్రపంచ స్థిరత్వం కోసం బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని, ముఖ్యంగా పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అమెరికా వైపు నుంచి కూడా ఈ సంభాషణ సానుకూలంగా సాగిందని సమాచారం. భారత్‌లోని అమెరికా ప్రతినిధి స్పందిస్తూ, ట్రంప్ పశ్చిమాసియాలోని తాజా పరిణామాలను మోదీకి వివరించినట్లు తెలిపారు. ఇరు దేశాలు కలిసి ప్రాంతీయ శాంతి, భద్రత కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. మొత్తంగా చూస్తే, ఈ ఫోన్ సంభాషణ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్‌అమెరికా కలిసి తీసుకునే చర్యలు కీలకంగా మారనున్నాయి.

## కసి, పట్టుదలే మనల్ని.. ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి



-కసి, పట్టుదలే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి

నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారితో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్ర చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. మాలో ఉండని కృషి, పట్టుదల మీలో ఉంటాయి. మీ జీవితంలో ఇప్పటివరకు ఎన్నో మాటలు, అవమానాలు ఎదుర్కొని ఉంటారు. వాటన్నింటిని అధిగమించి ఇక్కడి వరకు వచ్చారు. మనలో ఉన్న కసి, పట్టుదలే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాల అండగా ఉంటాం. సపోర్ట్ చేస్తాం. మీలాంటి వారిని ప్రోత్సహిస్తే సమాజంలో కూడా మార్పు వస్తుంది. దీనిని నేను వ్యక్తిగతంగా తీసుకుంటా. మా కుటుంబంలో కూడా ఒకరు సరిగా మాట్లాడటానికి తడబడేవారు. అనేక ఇబ్బందులు పడ్డారు. అతన్ని చాలామంది ఎగతాళి చేసేవారు. దేవుడు ప్రతి కుటుంబానికి ఓ పరీక్ష పెడతాడు. ఆ పరీక్షను జయించే శక్తి కూడా ఇస్తాడు. మీ అందరికీ ఆ శక్తి ఉంది. ప్రభుత్వం కూడా మద్దతుగా ఉంటుంది. సవాళ్లను అధిగమనించి ప్రపంచాన్ని జయించండి. సమాజం మిమ్మల్ని గౌరవించాలి. సొంత పిల్లల్లా చూసుకోవాలి. వ్యక్తిగా నేను ఆశించేది సమాజంలో మీరు తీసుకురావాలి.

--ప్రతి ఏడాది మిమ్మల్ని గుర్తించి ప్రోత్సహించాలనేది ప్రభుత్వ లక్ష్యం

ప్రతి ఏడాది మిమ్మల్ని గుర్తించి ప్రోత్సహించాలనేది ప్రభుత్వ లక్ష్యం. నూతన ఆవిష్కరణలను సీఎం చంద్రబాబునాయుడు కూడా ఎప్పుడూ ప్రోత్సహిస్తారు. ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఒకమాట చెప్పారు. అమ్మకు చెప్పలేని పని చేయవద్దని సూచించారు. దీనిని అందరూ జీవితాంతం గుర్తుపెట్టుకోవాలి. జీవితంలో అనేక దశల్లో ఉపాధ్యాయుల దగ్గర నుంచి ఎంతో మంది సాయం అందిస్తారు. నా జీవితంలో కూడా పలువురు ఉపాధ్యాయులు, రాజిరెడ్డి గారిలాంటి ప్రొఫెసర్లు సాయం చేశారు. మనం కూడా సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలి. మీ జీవితంలో కనీస 10 మందికి సాయపడాలి. అందరికీ ఆదర్శంగా ఉండాలి. మిమ్మల్ని చిన్నచూపు చూడాలంటే భయపడాలి. కసితో, పట్టుదలతో పనిచేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్య, దివ్యాంగులకు ప్రోత్సాహం, అభ్యసన ఫలితాలపై దృష్టిపెట్టామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను విద్యార్థులు విజయవంతంగా పూర్తిచేయాలని కోరుకుంటూ, వారిని అభినందిస్తూ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరితో కలిసి గ్రూఫ్ ఫోటో దిగారు. నేను పాఠశాల నుంచి ఇంటికి, ఇంటి నుంచి పాఠశాలకు మాత్రమే వెళ్లేవాడిని. ఏవైనా ఫంక్షన్స్ ఉంటే వెళ్లేవాడిని కాదు. నా రూపు చూసి అందరూ ఎగతాళి చేసేవారు. నంబూరు వద్ద ఎవరెస్ బేస్ క్యాంప్ సెలక్షన్స్ జరుగుతున్నాయని మా టీచర్ చెబితే వెళ్లాను. సెలెక్ట్ అయ్యాను. గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ అందించారు. అక్కడ నాలాంటి విద్యార్థులు పరిచయం అయ్యారు. ట్రైనింగ్ బాగా ఇచ్చారు. అనంతరం లద్దాఖ్ వెళ్లాం. మేం అంటే ఏమిటో ప్రపంచానికి చూపించాలి అనే కాన్ఫిడెన్స్ తో వెళ్లాం. మేం అక్కడ ట్రెక్కింగ్ చేశాం. మాలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని మరికొంత మంది ముందుకు వస్తారు. నీకు ప్రపంచం అంటే ఏమిటో తెలియదు కదా, నీ ఫ్రెండ్స్ ఎవరూ పట్టించుకోరు, నువ్వు ఎదగాలి అని తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఈ అవకాశం కల్పించిన మంత్రి నారా లోకేష్‌కి, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు కి ధన్యవాదాలు. ముమ్ముందు మరింత మద్దతు అందించాలని కోరుకుంటున్నాను.

-నీ కష్టమే నీకు విజయం తీసుకువస్తుంది

బి.సింధు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థిని (Hearing Impairment)

ఇంటర్ ద్వితీయ సంవత్సరం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, న్యూపేట్ , చంద్రగిరి, తిరుపతి జిల్లా

నేను ఇల్లు, కాలేజీ తప్ప ఎక్కడికీ వెళ్లను. తిరుపతిలో సెలెక్షన్స్ ఉన్నాయని, ప్రయత్నించాలని మా భవిత స్కూల్ టీచర్లు శ్యామల, రాజేశ్వరి చెబితే వెళ్లాను. నీ కష్టమే నీకు విజయం తీసుకువస్తుందని చెప్పారు. సెలెక్ట్ అయిన తర్వాత గండికోట తీసుకెళ్లారు. బాగా ట్రైనింగ్ ఇచ్చారు. అక్కడ సెక్యూరిటీ కూడా ఉంది. కాబట్టి మాకు సులభం అయింది. గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ సమయంలో రోజూ బాగా నడిపించేవారు. వెళ్లిపోదాం అనుకున్నాను. కష్టం తర్వాతే ఫలితం ఉంటుందని సార్స్ చెప్పారు. లద్దాఖ్ లో మైనస్ 5 డిగ్రీల చలిలో ట్రెక్కింగ్ చేశాం. ఇప్పుడు అంతా బాగుంది. ఇలాంటి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

ఎవరెస్ట్ శిఖర అధిరోహణ యాత్ర చేపడుతుండటం చాలా ఆనందంగా ఉంది. గండికోటలో బాగా శిక్షణ ఇచ్చారు. మొదట మా నాన్నగారు వద్దని వచ్చేయమన్నారు. అమ్మ మాత్రం పట్టుపట్టింది. స్కూల్ ఫ్రెండ్స్ కూడా నువ్వు చేయలేవన్నారు. నేను చేసి చూపిస్తానని చెప్పా. మా గ్రూఫ్ ఫోటో చూసిన తర్వాత మా అమ్మ చాలా సంతోషించింది. లద్దాఖ్ చూసిన తర్వాత నా మైండ్ పోయింది. అక్కడి సుందర ప్రదేశాలు చాలా బాగున్నాయి. చలి వేసినా అందరూ ఉండటం వల్ల ముందుకుసాగాం. ఇలాంటి అవకాశం కల్పినందుకు ధన్యవాదాలు. నేను సెలెక్ట్ అయిన మా ఫ్రెండ్స్ అందరూ క్లాప్స్ కొట్టారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య డైరెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఏఎస్ పీడీ కె.రవీంద్రనాథ్ రెడ్డి, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ సీఈవో శేఖర్ బాబు, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ పర్వతారోహకులు సాయిక్ హిమాన్షు, రఘునాథరెడ్డి, ఎం.పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులర్పించిన ఆంజనేయులు సాగర్

## అంజయ్య నగర్ లో ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం అంజయ్య నగర్ డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ పాల్గొని సిద్ధిక్ నగర్ లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం సమానత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అన్ని కులాలు, వర్గాలు సమానంగా జీవించే సమాజాన్ని నిర్మించడమే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా బలహీన వర్గాల హక్కులను పరిరక్షించేందుకు, వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమాజంలో అసమానతలను తొలగించి సమాన హక్కులు కలిగిన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత అంబేద్కర్ జీవితం నుంచి ప్రేరణ పొంది విద్య, నియమనిష్ఠలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిక్ నగర్ సీనియర్ నాయకులు నందు, కాలనీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, నాయకులు అంజయ్య,


అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆంజనేయులు సాగర్ తదితరులు


బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఆంజనేయులు సాగర్

# గౌలిదొడ్డిలో ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు


బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జంగయ్య యాదవ్


అంబేద్కర్ జయంతి వేడుకల్లో రాగం జంగయ్య యాదవ్, రాగం హరిశంకర్ యాదవ్ తదితరులు

**భారత రాజ్యాంగ రూపకల్పనలో బిఆర్ అంబేద్కర్ ది కీలక పాత్ర...**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో మంగళవారం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గచ్చిబౌలి మాజీ వార్డు సభ్యుడు రాగం జంగయ్య యాదవ్, నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రాగం హరి శంకర్ యాదవ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితంలో ఆయన చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శం అన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో భారతరత్న బిఆర్ అంబేద్కర్ ది కీలక పాత్ర అని వివరించారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ, ఆయన చూపిన మార్గంలో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దారుగుపల్లి పరమేష్, భీమ్‌రాజ్, గద్దర్ రాజ్, రవి కుమార్, అరుణ్, సాయిరామ్, సాయినాథ్, నర్సింహా, శాంబ, పి. రమేష్, ఈ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా: ప్రధాని మోదీ

ఈ కబురు : వచ్చే ఏడాది ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో కుంభమేళా నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. కుంభమేళా నిర్వహణకు వీలుగా 'దేవ్‌భూమి'ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని..పుణ్యస్థలాల్లో ప్రజలు కూడా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు ప్రతిబింబించేలా కుంభమేళాను పరిశుభ్రంగా, వైభవంగా జరుపుకొందామన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు ఆసక్తిగా ఎదురు చూసే మినీ చార్‌ధామ్ యాత్ర కూడా మరికొన్ని నెలల్లో ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో భక్తుల రాకతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. దిల్లీదెహ్రాదూన్ ఎకనమిక్ కారిడార్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన 213 కిలోమీటర్ల హైస్పీడ్, యాక్సెస్‌కంట్రోల్డ్ హైవే దిల్లీ దెహ్రాదూన్ మధ్య ప్రయాణ సమయాన్ని ఆరు గంటల నుంచి రెండున్నర గంటలకు తగ్గిస్తుందన్నారు. కొత్త ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంత ఆర్థిక స్వరూపం పూర్తిగా మారిపోతుందని.. రోడ్లు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వేలు, విమాన, జలమార్గాలు కలిసి దేశ భవిష్యత్ మార్గాన్ని నిర్దేశిస్తాయన్నారు.

# దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి

## డా. బిఆర్ అంబేద్కర్ : ముత్తోజు ఆమని

- అంజయ్య నగర్ డివిజన్లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

ఈకబురు, శేరిలింగంపల్లి : దేశ అభివృద్ధి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అంజయ్య నగర్ డివిజన్ బీజేపీ నాయకురాలు ముత్తోజు ఆమని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం అంజయ్య నగర్ డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అంజయ్య నగర్ డివిజన్ వాసులు, స్థానిక యువతతో కలిసి హాజరైన ముత్తోజు ఆమని సిద్ధిక్ నగర్ లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమని మాట్లాడుతూ పేద, బడుగు బలహీనవర్గాల శ్రేయస్సు కోసం, సమాజంలో అంటరానితనం నిర్మూలన, వివక్షపై బిఆర్ అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. భారత రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్ కే దక్కుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశానికి వారు అందించిన సేవలను మరోసారి స్మరించుకోవాలని, నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈరోజు ఆయన మన ముందు లేకపోయినా మన గుండెల్లో చిరస్థాయిగా ఎప్పటికీ నిలిచి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య నగర్ డివిజన్ వాసులు, స్థానిక యువజన విభాగం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


ఆమనితో కలిసి అంబేద్కర్ జయంతి వేడుకల్లో అంజయ్య నగర్ స్థానికులు, యువత


బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముత్తోజు ఆమని


మహనీయుడి విగ్రహంతో ముత్తోజు అమని, ముత్తోజు అభిషేక్

# సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయం


అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న కొల్లూరి భరత్


బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న మాజీ కౌన్సిలర్ భరత్, స్థానిక నాయకులు

- ఆ మహనీయుడిని స్మరించుకోవడం ప్రతి ఇక్కరి బాధ్యత
- మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత కొల్లూరి భరత్
- తెల్లాపూర్‌లో ఘనంగా బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**ఈ–కబురు, పటాన్‌చెరు:**

భారత రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు చరిత్ర పుటలో చిరస్మరణీయమని తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు కొల్లూరి భరత్ అన్నారు. మంగళవారం అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు తెల్లాపూర్‌లు ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు అంబేద్కర్ విగ్రహాలకు స్థానిక నాయకులు, యువజన సంఘాల ముఖ్యులతో కలిసి భరత్ పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఆయన మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల హక్కులు, అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. దేశంలో అంటరానితనం, కుల నిర్మూలన కోసం అంబేద్కర్ పోరాడారని, సాంతంత్ర్యం తరువాత భారతదేశ రాజ్యాంగ స్థాపనకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అంబేద్కర్ ఆలోచనలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని, ఆ మహనీయుడిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. రిజర్వేషన్ హక్కులు కల్పించి బడుగు, బలహీన వర్గాలను అన్ని రంగాల్లో భాగం చేశారని, అంబేద్కర్ లేకుంటే నేడు దేశంలో ప్రజాస్వామ్యమే లేదని చెప్పారు. దేశానికి, నిమ్న వర్గాలకు అంబేద్కర్ అందించిన సేవలపై నేటి యువత అవగాహణ కల్పించుకోవాల్సిన అవసరం ఉందని భరత్ అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలను జీవన విధానంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలలో ట్టటి మేధావి, ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ కొల్లూరి సత్తయ్య, మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, గుల్లి రవీందర్, కొల్లూరి శ్రీను, ప్రభాకర్ రెడ్డి, ఎల్ రవీందర్, సుధాకర్ రెడ్డి, గుల్లి సుదర్శన్, ఉప్పరి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చూపిన బాట ఆదర్శనీయం : పల్లపు సురేందర్

**నల్లగండ్ల డివిజన్ లో ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి భారతరత్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపించిన బాట ఆదర్శనీయమని నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్ల డివిజన్‌లో భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో దాదాపు 1000కి పైగా ఆటోలు, బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గోపనపల్లి, గోపనపల్లి తాండా, ఎన్టీఆర్ నగర్, టీఎన్‌జీఓ కాలనీ, ట్రిపుల్ ఐటీ, హెచ్ సియు, నేతాజీ నగర్, గుల్మోహర్ పార్క్, నల్లగండ్ల ప్రాంతాల మీదుగా సాగింది. అనంతరం గోపనపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి పల్లపు సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరై బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, అస్పృశ్యతను రూపుమాపేందుకు బిఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిది అన్నారు. అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పిస్తూ దేశ రాజ్యాంగాన్ని నిర్మించిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజు నాయక్, హనుమంతుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సురేందర్ తదితరులు


నల్లగండ్ల డివిజన్ లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

ఈకబురు, శేరిలింగంపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను శేరిలింగంపల్లి నియోజకవర్గం బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి మారబోయిన రవికుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజిత్ కుమార్ సేనాపతి, మాజీ కౌన్సిలర్లు రాఘవేంద్ర రావు, మంగళి వెంకట రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చందానగర్ లో నిర్వహించిన జయంతి వేడుకల్లో బిజెపి రాష్ట్ర నాయకుడు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్ష, అసమానతలు పోవాలంటే, అంబేద్కర్ చెప్పిన ఒకే మంత్రం చదువు, చదివించు అని... ఆ చదువు తర్వాత పోరాడి గెలిచే తెలివి, శక్తి అలవడి, తరాల అంతరాలు కనుమరుగై పోవడంతో పాటు సమసమాజ నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోబీజేపీ నాయకులు జితేందర్, బోయిని మహేష్ కుమార్ యాదవ్, నాగం రాజశేఖర్, నూనె సురేందర్, వనమా శ్రీనివాస్ గుప్త, అమరేంద్ర ప్రతాప్ సింగ్, రాకేష్ దూబే, పగడాల వేణు గోపాల్, చంద్రకాంత్, వెంకటేశ్వర్లు, గొల్లపల్లి రాంరెడ్డి, పవన్ కుమార్, శ్రీనివాస్ ముదిరాజ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న రవికుమార్ యాదవ్ కసిరెడ్డి భాస్కర్ రెడ్డి



# కాంగ్రెస్‌ను ఎదుర్కొందాం..

ఈ కబురు, హైదరాబాద్ ;
కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలను అడుగడుగునా ఎదుర్కొందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. తెలంగాణ భవన్ లో అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఆయన నిర్వహించారు. అనంతరం ట్యాంక్ బండ్ లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, 2024 ఏప్రిల్ 14న బాబాసాహెబ్ అంబేద్కర్ ని బందీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ నిర్మాణం చేశారన్న కోపంతో ఆ మహానుభావుడ్ని సంకెళ్లలో పెట్టి ఎవరినీ వెళ్లనివ్వకుండా కాంగ్రెస్ బంధించిందని ఆరోపించారు.అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 అనేది లేకపోతే ఇవాళ తెలంగాణ రాష్ట్రం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 1000 గురుకుల పాఠశాలలు నిర్మించిందని గుర్తుచేశారు. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని సరిగ్గా నిర్వహించలేకపోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అంబేద్కర్ గారిని రాజకీయ అవసరాల కోసం వాడుకుందే తప్ప గౌరవించలేదని మండిపడ్డారు. అంబేద్కర్ ను ఎంతగానో ఆ పార్టీ అవమానించిందని విమర్శించారు.మరోవైపు కేసీఆర్ దళిత బంధు కింద రూ.10 లక్షలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అదే స్కీమ్ కి 'అంబేద్కర్ అభయహస్తం' అని పేరు పెట్టిందన్నారు. కానీ ఇప్పటివరకు అమలు చేయలేదని మండిపడ్డారు. దళిత బంధు, రైతు బంధు లాంటి పథకాలు తేవాలంటే నాయకుడికి 'ఖలేజా' ఉండాలని అది కేసీఆర్ కు ఉందని ప్రశంసించారు. అటు కాంగ్రెస్ చేసిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ మోసాన్ని ప్రతి గిరిజన తండాకు, ప్రతి దళిత వాడకు తెలిసేలా చేయాల్సిన బాధ్యత తమపై ఉందని కేటీఆర్ అన్నారు.ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం తర్వాత.. మే, జూన్ నెలల్లో ఎక్కడో ఒక దగ్గర ఎస్సీ, ఎస్టీల కోసం సభలు ప్రారంభిద్దామని కేటీఆర్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్, చేవెళ్ళ డిక్లరేషన్, వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యువజన డిక్లరేషన్, విద్యార్థి డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్.. ఇలా కాంగ్రెస్ చేసిన ప్రామిస్‌ల మీద పకడ్బందీగా పోరాడాలన్నారు. మరోవైపు కేసీఆర్ 125 ఫీట్ల విగ్రహం మాత్రమే కాదు, డాక్టర్ బాబాసాహెబ్ పేరు మన సెక్రటేరియట్‌కు పెట్టారని, పార్లమెంట్ కొత్త భవనానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. కాబట్టి జై కేసీఆర్ నినాదంతో ముందుకు సాగుదామని కేడర్ కు పిలుపునిచ్చారు.

# లక్షలాది మందిని క్వాంటం నిపుణులుగా తీర్చిదిద్దుతాం





1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను సీఎం జాతికి అంకితం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు నుంచి అమరావతిలో క్వాంటం వ్యాలీ కూడా ప్రారంభమవుతుందని తెలిపారు. వన్ ఫ్యామిలీ వన్ ఆంత్రప్రెన్యూర్‌తో పాటు ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్‌ను తీసుకురావాలని ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు వివరించారు.ఐఐటీ చెన్నై, ఐబీఎం సంస్థల భాగస్వామ్యంతో లక్షలాది మందిని క్వాంటం రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. కొత్త సంస్థలు, నైపుణ్యం, క్వాంటం మౌలిక సదుపాయాలతో భవిష్యత్తును నిర్మిస్తున్నామని అన్నారు. ఔషధాల ఆవిష్కరణ, వ్యవసాయ ఉత్పాదకత, రక్షణ పరిశోధన, లాజిస్టిక్స్ లాంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ లావాదేవీలు మరింత సురక్షితంగా మారే అవకాశం ఉందన్నారు. క్లైమేట్ మోడలింగ్ లాంటి అంశాలను చేపట్టవచ్చని అభిప్రాయపడ్డారు. క్రయోజనిక్స్, ఫ్యాబ్రికేషన్, యాంప్లిఫైడ్ రీసెర్చ్‌లలో విస్తృతంగా ఆవిష్కరణలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

--అమరావతిలో ఏదో మ్యాజిక్ ఉంది: ఎల్. వి. సుబ్రమణ్యం

అమరావతిలో కంపెనీ ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చారని క్యూబిట్‌ఫోర్స్ సీఈవో ఎల్. వెంకట సుబ్రమణ్యం అన్నారు. దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటర్ తయారు చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు. నాలుగు నెలల్లోనే క్వాంటం బెడ్‌లు తయారు చేయగలమని అస్సలు ఊహించలేదు. అమరావతిలో ఏదో మ్యాజిక్ ఉంది. అందుకే ఇది సాధ్యమైంది. ముఖ్యమంత్రి పిలుపును ఛాలెంజ్‌గా తీసుకొని ముందడుగు వేశాం. నిన్నటి విజన్.. నేటి నిజం.. రేపటి పరిశ్రమ.. ఇదే అమరావతి క్వాంటం'' అని అన్నారు.

# తెలంగాణలో ఠారెత్తిస్తున్న ఎండలు



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. రాష్ట్రంలో వివిధ చోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌తోపాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్.. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉంది. గురువారం నుంచి ఎండలు మరింత ఠారెత్తించే అవకాశమున్నట్లు వాతావరణశాఖ తెలిపింది.

# అంబేద్కర్ సిద్ధాంతాలు అన్ని వర్గాలకు మార్గదర్శకం

## జయంతి కార్యక్రమంలో బీహెచ్ఈఎల్ ఈడీ వై. శ్రీనివాస రావు



బేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న బీహెచ్ఈఎల్ ఈడీ శ్రీనివాస రావు, ఇతర అధికారులు, యూనియన్ ప్రతనిధులు




బట్టలు, స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో అంబేద్కర్ భవన్ కమిటీ చైర్మన్ హరి రామకృష్ణ, ఇతర సభ్యులు, పాఠశాల సిబ్బంది

**ఈ–కబురు, పటాన్‌చెరు :**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలు సమాజంలోని అన్ని వర్గాలకు మార్గదర్శకమని బీహెచ్ ఈఎల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వై. శ్రీనివాస రావు పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ జయంతోత్సవాలను భెల్‌లో ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీహెచ్ ఈఎల్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. బీహెచ్‌ఈఎల్ జనరల్ మేనేజర్లు, డీఆర్ఓలు, సీనియర్ అధికారులతో పాటు వివిధ యూనియన్ల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జయంతి సభలో ఈడీ శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అంబేద్కర్ అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగ విలువలు కాపాడే విధంగా నడుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రెసిడెంట్ కృష్ణంరాజు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రెహ్మాన్, సెలబ్రేషన్ కమిటీ చైర్మన్ భీగన్న, భెల్ ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు జి సురేందర్, లైజన్ ఆఫీసర్ ఎం శంకరయ్య, సూపర్‌వైజర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాల్‌రాజ్ , ఎగ్జిక్యూటీవ్ అసోసియేషన్ అధ్యక్షుడు టి హరీశ్ , ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్ రవీందర్, పీహెచ్ అసోసియేషన్ జీఎస్ యేసుదాస్, ఓబీసీ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలి : భెల్ అంబేద్కర్ భవన్ కమిటీ చైర్మన్ హరి రామకృష్ణ**

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని బీహెచ్ ఈఎల్ అంబేద్కర్ భవన్ కమిటీ చైర్మన్ ఏజీఎం హరి రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని యూఆర్ఎస్ హాస్టల్ విద్యార్థులకు ఆయన దుస్తులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హరి రామకృష్ణ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత భేదాలు చూడకుండా పేద విద్యార్థులకు సహకారం అందించాలని, ఇలాంటి కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతంగా స్థిరపడిన వారు ముందుకు రావాలని కోరారు. ఇలాంటి సమానత్వ కోసమే అంబేద్కర్ పోరాడారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు బాగా చదువుకొని సమాజ అభివృద్ధిలో భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణ్ గౌడ్, సెలబ్రేషన్ కమిటీ చైర్మన్ శంకరయ్య, సభ్యులు హరి సింగ్, రవీందర్, దేవా, అర్జున్, సురేందర్, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న భెల్ ఈడీ వై శ్రీనివాస రావు

# అంబేద్కర్ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి ఆదర్శం

**బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్**

**ఈ–కబురు, పటాన్‌చెరు :**

దేశ ప్రజల మధ్య అసమానతలను తొలగించేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని బీఆర్ ఎస్ సీనియర్ నాయకుడు, ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ముత్తంగి జీహెచ్‌ఎంసీ డివిజన్ పరిధిలోని వెలిమెలలో ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. స్థానిక నాయకులతో కలిసి కేకును కట్ చేసి అంబేద్కర్ జయంతోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి వర్గానికి సమాన హక్కులు కల్పించడంలో అంబేద్కర్ పాత్ర అపారమని కొనియాడారు. కుల, మత, రాజకీయ అసమానతలను ఆలోచించి ప్రజలందరికీ ఆమోద యోగ్యమైన రాజ్యాంగాన్ని నిర్మించారని పేర్కొన్నారు. అంబేద్కర్ సేవలను గుర్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వెలిమెల గ్రామంలో రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాటసారు కోసం చలివేంద్రాన్ని ప్రారంభించారు. బీడీఎల్ సీఐ వెంకటేశంతో కలిసి కాల్వగడ్డ రాజ్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, ప్రయాణికులకు, కార్మికులకు ఉపయోగపడే చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మరిన్ని చలివేంద్రాల ఏర్పాటుకు సహకరిస్తానని రాజ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో గ్రామ పెద్దలు, రాజ్‌కుమార్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వెలిమెలలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలల వేసి నివాళ్లర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కాల్వగడ్డ రాజ్‌కుమార్




వెలిమెలలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ లీడర్ కాల్వగడ్డ రాజ్ కుమార్

# జల మార్గాల్లో ఇబ్బంది జరిగితే.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలు



ఈ కబురు : ప్రపంచంలో అత్యధిక సరకు రవాణా జల మార్గాల్లోనే జరుగుతుంది. ప్రపంచ వాణిజ్యానికి ఈ మార్గాలు జీవనాడుల్లాంటివి. ఇక్కడ ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా.. ఆర్థిక వ్యవస్థలకు ఉక్కపోత మొదలవుతుంది. తాజాగా ఒక్క హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతకే చమురు రవాణా 20శాతం స్తంభించింది. ఇక ఎల్పీజీ, ఎరువులు, ప్లాస్టిక్, హీలియం, ఇతర పెట్రో ఉత్పత్తులకు కటకట మొదలైంది. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి సముద్ర మార్గాలు మరిన్ని ఉన్నాయి. వీటిల్లో చోటు చేసుకొనే చిన్న అలజడి కూడా స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చగలదు. అవేంటో తెలుసా..!

--పనామా కాల్వ..!

అట్లాంటిక్‌పసిఫిక్ సముద్రాలను కలుపుతూ ఉత్తరదక్షిణ అమెరికా మధ్య నిర్మించిన కాల్వ ఇది. అమెరికా నుంచి ఆసియా మార్కెట్ల వైపు సరకు రవాణాకు అత్యంత కీలకమైంది. ఏటా 13,000కు పైగా రవాణా నౌకలు ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. ముఖ్యంగా అమెరికా, చైనా,జపాన్, చిలీ, దక్షిణ కొరియా తదితర దేశాలకు కీలకమైంది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టాక ఈ కాల్వను స్వాధీనం చేసుకోవడానికి తీవ్రంగా యత్నించారు. కానీ, పనామా ప్రతిఘటనతో ట్రంప్ యత్నాలు ప్రస్తుతానికి నెమ్మదించాయి. మళ్లీ ఎప్పుడైనా ఇవి తెరపైకి రావొచ్చు. ఇక వరదలు, కరవు, పొగమంచు, ధూళి మేఘాలు, నౌకల మరమ్మతుల సౌకర్యాలు లేకపోవడం ఈ మార్గంలో ప్రధాన ఇబ్బందులు.

--సూయజ్ కాల్వ..!

మధ్యధరా సముద్రం నుంచి ఎర్ర సముద్రాన్ని కలుపుతూ ఈజిప్టు భూభాగంలో మానవ నిర్మిత కాల్వ ఇది. 1869లో అందుబాటులోకి వచ్చింది. దాదాపు 200 మీటర్ల వెడల్పుతో 163 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. దీనిని దాటేందుకు 15 గంటలకు పైగా సమయం పడుతుంది. ప్రపంచ వాణిజ్యంలో 12%, కంటైనర్ ట్రాఫిక్‌లో 30% శాతానికి ఈ మార్గమే దిక్కు. ఏటా 19,000కు పైగా నౌకలు ప్రయాణిస్తాయి. 2021లో ఎవర్ గివెన్ అనే అతి భారీ నౌక ఈ కాల్వలో అడ్డంతిరగడంతో రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనిని సరిచేశాక ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకొన్నాయి.

--మలక్కా జలసంధి..

భౌగోళికంగా ఇండోనేసియా, మలేసియా, సింగపూర్ మధ్య ఉంది. భారత్‌కు అతి సమీపంలోని కీలక జలమార్గం కూడా ఇదే. పసిఫిక్‌హిందూ మహాసముద్రాలను కలుపుతుంది. దీనిలో అతి ఇరుకైన మార్గం 1.5 నాటికల్ మైళ్లు ఉంది. 30%శాతం ప్రపంచ వాణిజ్యం ఈ మార్గంలోనే జరుగుతుంది. ఇక ప్రపంచ ఫ్యాక్టరీ చైనాకు చేరే ఇంధనానికి ఈ మార్గమే దిక్కు. ఇక 40% కంటైనర్లు ఈ జలాల్లోనే ప్రయాణిస్తాయి.

--హర్మూజ్ జలసంధి..

ఇరాన్‌ఒమన్‌యూఏఈలో ఈ జలసంధి తీరాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే 20శాతం ఎల్ఎన్‌జీ, రోజుకు 2 కోట్ల బ్యారెళ్ల చమురు ఈ మార్గం నుంచి వెళుతుంది. గల్ఫ్ దేశాల ఎగుమతులు, దిగుమతులకు ఈ మార్గమే జీవనాడి. ఇరాన్‌ఇరాక్ మధ్య, ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతల సమయంలో ఈ జలసంధి దాదాపు మూతపడింది. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ రెండూ దీనిలో రవాణాను అడ్డుకొంటున్నాయి.

--బాబ్ ఎల్ మండెప్ జలసంధి..

ఇది యెమన్‌జిబూటీ, ఎరిత్రియా తీరాలను పంచుకొంటోంది. ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో కలుపుతుంది. ప్రపంచ వాణిజ్యంలో 12%, కంటైనర్ ట్రాఫిక్‌లో 30% ఈ మార్గం నుంచే వెళుతుంది. కానీ, ఈ ప్రదేశంలో ఇరాన్ మద్దతుదార్లైన హూతీల దాడులు నౌకాయానాన్ని కఠినంగా మార్చేశాయి. 2023లో 26,000 నౌకలు ప్రయాణించగా.. 2025 నాటికి వాటి సంఖ్య 12,700కు పడిపోయింది. చాలా నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గాన్ని ఎంచుకొంటున్నాయి.

--తుర్కియే జలసంధులు..

నల్లసముద్రంమధ్యధరా సముద్రాన్ని కలుపుతూ తుర్కియేలో బాస్ఫరస్,డర్డనెల్స్ జల సంధులు ఉన్నాయి. నల్ల సముద్రం నుంచి అంతర్జాతీయ సముద్ర జలాల్లోకి నౌకలు చేరాలంటే ఈ మార్గాల్లో ప్రయాణించాల్సిందే. ఆసియాఐరోపాను అనుసంధానించే కీలక మార్గాల్లో ఇది కూడా ఒకటి. ప్రపంచ చమురులో 3%, గోధుమల రవాణా 25% ఈ మార్గం నుంచే జరుగుతుంది. తుపానులు, పొగమంచు, యుద్ధాలు ఈ మార్గంలోని ప్రధాన సమస్యలు.

## సజ్జనార్ ను కలిసిన మంగ్లీ..



హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను సినీ గాయని మంగ్లీ కలిశారు. అడ్వకేట్ సుబ్బారావుకు, మంగ్లీకి మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, మైక్రోఫైనాన్స్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ మంగ్లీ తాజాగా సీపీ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

మైక్రోఫైనాన్స్ పేరుతో తాను, తన తమ్ముడు మోసాలకు పాల్పడ్డామన్న సుబ్బారావు ఆరోపణలను ఈ సందర్భంగా మంగ్లీ ఖండించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న సుబ్బారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే మోసపోయిన బాధితులకు న్యాయం చేసి అసలు దోషులను పట్టుకోవాలని కోరారు.

గత నెల 22న సుబ్బారావు తనను కలిసి, సోషల్ మీడియాలో ఉన్న నెగెటివ్ వీడియోలను తొలగించాలంటే రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని మంగ్లీ ఆరోపించారు. అందుకు తాను నిరాకరించడంతోనే ఈ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తనకు పాటలు తప్ప వేరే వ్యాపారాలు లేవని, డబ్బుల కట్టలతో ఉన్న వీడియోలో ఉన్నది తన తమ్ముడు కాదని మంగ్లీ స్పష్టం చేశారు. ఒకవేళ తన తప్పు ఉందని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. సుబ్బారావు కేవలం ఫేమస్ కావడానికే తన పేరును వాడుకుంటున్నారని మంగ్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోవైపు, నిన్న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బాధితులతో కలిసి హంగామా చేసిన సుబ్బారావుకు పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించగా, 27 ఎంజీ రీడింగ్ వచ్చింది. మద్యం సేవించి స్టేషన్‌లో ఆయన ప్రవర్తించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




## ‘టాక్సిక్’ వాయిదా వార్తలు.. స్పందించిన టీమ్

‘టాక్సిక్’ కొన్ని రోజులుగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. యశ్ (Yash) హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా (Toxic Movie) మరోసారి వాయిదా పడనుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలను టీమ్ ఖండించింది. అనుకున్న షెడ్యూల్ ప్రకారం జూన్ 4నే సినిమా విడుదల అవుతుందని స్పష్టంచేసింది. ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడానికి కూడా సిద్ధమైనట్లు తెలిపింది.

నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి యశ్ ప్రచారం మొదలుపెట్టారు. అమెరికాలో జరుగుతోన్న సినిమాకాన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ‘టాక్సిక్’తో పాటు ఆయన మరో చిత్రం ‘రామాయణ’ గురించి కూడా ఈ కార్యక్రమంలో మాట్లాడనున్నారు. దీంతో యశ్ టాక్సిక్ వాయిదా వార్తలకు చెక్ పడింది. ఇందులో అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ (Huma Qureshi) ఎలిజిబెత్‌గా, నయనతార (Nayanthara) గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు.

## ‘జురాసిక్’ పార్క్ మూవీని రిజెక్ట్ చేసిన శ్రీదేవి.. కారణం అదే!

హాలీవుడ్ సినిమాల్లో అవకాశమొస్తే ఎవరైనా వదులుకుంటారా? డబ్బుకు డబ్బు.. కావాల్సినంత ప్రచారం రెండూ ఒకేసారి వచ్చి పడతాయి. అందులోనూ స్టీవెన్ స్పీల్‌బర్గ్ మూవీ అంటే కథేంటో కూడా అడగకుండా ఒప్పుకొంటారు. కానీ, అలనాటి నటి శ్రీదేవి మాత్రం నో చెప్పారట. ఇంతకీ అదేం సినిమానో తెలుసా? ‘జురాసిక్ పార్క్’. అవును.. యావత్ సినీ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసిన చిత్రమది. 1993లో విడుదలైన ‘జురాసిక్ పార్క్’ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షా న్ని కురిపించింది. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్ల వసూళ్లను రాబట్టింది. అలాంటి చిత్రంలో నటించే అవకాశాన్ని శ్రీదేవి కాదనుకున్నారు. అందుకు గల కారణాన్ని ఆమె ఓ సందర్భంలో పంచుకున్నారు.

మీరెందుకు ‘జురాసిక్ పార్క్’ (Jurassic Park) చేయడానికి నిరాకరించారు అని అడగ్గా, ‘ఆ రోజుల్లో హాలీవుడ్ సినిమాలంటే ఏలియన్‌లా చేయడమే. కానీ, ఇప్పుడు అదొక గౌరవం. అందుకే ఒప్పుకోలేదు’ అని శ్రీదేవి (Sridevi) సమాధానం ఇచ్చారు. కేవలం ‘జురాసిక్ పార్క్’ మాత్రమే కాదు, శ్రీదేవి కెరీర్ టాప్‌లో ఉండగా, వివిధ కారణాల వల్ల చాలా పాత్రలు వదులుకున్నారు. అందులో ‘డర్’ కూడా ఉంది. ‘చాందినీ, లమ్హే తర్వాత డర్‌లో నా పాత్ర చాలా సాధారణంగా ఉంటుందని భావించా. ఒకవేళ షారుఖ్‌ఖాన్ పోషించిన పాత్రలాంటిదైతే చేసేదాన్నేమో.ఆ క్యారెక్టరైజేషన్ నాకు బాగా నచ్చింది. ఇక జుహీచావ్లాకు అలాంటి పాత్ర కొత్తది. ఆమె సరిగ్గా సరిపోయారు’ అని శ్రీదేవి చెప్పుకొచ్చారు. 2018, ఫిబ్రవరి 24న శ్రీదేవి కన్నుమూసిన సంగతి తెలిసిందే.



## తొలిసారి అలాంటి పాత్ర చేస్తున్నా.. 'లీసా'పై అనన్య ఆసక్తికర వ్యాఖ్యలు

**టాలీవుడ్ యువ నటి అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లీసా'. జవహర్ లాల్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, టైటిల్‌ను నిన్న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది.**

ఈ సందర్భంగా అనన్య నాగళ్ల మాట్లాడుతూ, కథ విన్న వెంటనే ఈ సినిమా చేయడానికి అంగీకరించానని తెలిపారు. "ఒక నటిగా నా పాత్రకు ప్రాధాన్యత ఉందా, కొత్తగా ఏం చేయగలను అని ఆలోచిస్తాను. 'లీసా'లో నా పాత్ర చాలా వైవిధ్యంగా అనిపించింది. హీరోయిన్లకు ఇలాంటి పవర్‌ఫుల్ పాత్రలు దొరకడం చాలా అరుదు. అందుకే వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను" అని ఆమె వివరించారు. ఈ సినిమా తన కెరీర్‌లో కచ్చితంగా గుర్తుండిపోయే చిత్రంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సినిమాటోగ్రాఫర్ సతీష్ రెడ్డి అందించిన విజువల్స్ గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. "గతంలో నేను నటించిన ఏ సినిమా విజువల్స్ చూసి కూడా ఇంతలా ఎగ్జైట్ కాలేదు. ఆయన పనితనం చూశాక నటిగా ఇంకా బాగా చేయాలనే స్ఫూర్తి కలిగింది," అని అనన్య కొనియాడారు. తెల్లవారుజాము వరకు షూటింగ్ చేస్తూ చిత్ర బృందం ఎంతో కష్టపడిందని ఆమె గుర్తుచేసుకున్నారు.




## ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ మూవీ క్రేజీ అప్‌డేట్.. అలియా భట్, షాహిద్ కపూర్‌లతో భారీ స్కెచ్!

గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ (వర్కింగ్ టైటిల్: డ్రాగన్) కోసం చిత్రబృందం భారీ తారాగణాన్ని రంగంలోకి దింపుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత ఎన్టీఆర్అలియా జోడీని మళ్ళీ వెండితెరపై చూడాలని ఆశపడుతున్న అభిమానులకు ఇది తీపి కబురు. ఇప్పటికే చిత్రబృందం ఆమెతో సంప్రదింపులు జరిపిందని, అలియా కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.

మరోవైపు, ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ పాత్ర కోసం బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మొదట ఈ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ను అనుకున్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆయన తప్పుకున్నారు. ఇప్పుడు షాహిద్ కపూర్‌ను విలన్‌గా చూపించి పాన్‌ఇండియా స్థాయిలో సినిమాపై అంచనాలు పెంచాలని ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నారట. ఈ భారీ తారాగణంపై అధికారిక ప్రకటన వస్తే, ఈ ప్రాజెక్ట్ బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించడం ఖాయమని అభిమానులు అంటున్నారు.



## ‘డెకాయిట్’పై రామ్‌చరణ్ రివ్యూ



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ నటించిన రొమాంటిక్, యాక్షన్ మూవీ ‘డెకాయిట్’. ఇటీవల థియేటర్లలో విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. తాజాగా ఈ చిత్రానికి అగ్ర హీరో రామ్‌చరణ్(Ram Charan) రివ్యూ ఇచ్చారు. ‘డెకాయిట్’ చూసి బాగా ఎంజాయ్ చేశానని ఎక్స్‌లో పోస్టు చేశారు.

“నేను డెకాయిట్ చూశాను. చాలా ఎంజాయ్ చేశాను. హరి పాత్రలో అడివిశేష్ గుర్తుండిపోయేలా నటించారు. మృణాల్ తన పాత్రకి న్యాయం చేస్తూ, భావోద్వేగాలను డెప్త్‌గా చూపించారు. అనురాగ్‌కశ్యప్‌తో పాటు నటీనటులంతా ఎంతో చక్కగా వారి పాత్రలకు తగ్గట్టు నటించారు. ఇక సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో నిర్మించారు” అంటూ ‘డెకాయిట్’(Dacoit) చిత్రబృందానికి రామ్‌చరణ్ ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు.

బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ‘పెద్ది’ చిత్రంలో రామ్‌చరణ్ నటిస్తున్నారు. ఇందులో జాన్వీ కపూర్ కథానాయిక. ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానున్నట్టు సమాచారం.

## నివేదా పేతురాజ్ సెకండ్ ఇన్నింగ్స్ ..కెరీర్‌పై మళ్లీ ఫోకస్

'మెంటల్ మదిలో', 'చిత్రలహరి' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్, వ్యక్తిగత కారణాలతో సినిమాలకు విరామం ఇచ్చి ఇప్పుడు మళ్లీ కెరీర్‌పై దృష్టి సారించింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ నటి, బిజినెస్ మేన్ రజిత్ ఇబ్రాన్‌తో ప్రేమలో పడి 2023లో వెండితెరకు దూరమయింది.పెళ్లి చేసుకోబోతున్నట్టు ఇద్దరూ హింట్ కూడా ఇచ్చారు. ఈ తరుణంలో మనస్పర్థల కారణంగా వీరిద్దరూ విడిపోయారు. తాజాగా రజిత్ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకోవడంతో, నివేదా తన గతాన్ని వదిలేసి మళ్లీ సినిమాల్లో బిజీ అవ్వాలని నిర్ణయించుకుంది. గతంలో స్టార్ హీరోలతో నటించిన నివేదా... ఇప్పుడు కథలో ప్రాధాన్యత ఉన్న ఎలాంటి పాత్రనైనా (క్యారెక్టర్ రోల్స్) చేయడానికి సిద్ధమని మేకర్స్‌కు సందేశాలు పంపుతున్నట్టు సమాచారం. ప్రేమ కోసం, ఎదుగుతున్న కెరీర్‌ను పణంగా పెట్టిన నివేదా పరిస్థితిని చూసి నెటిజన్లు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభ ఉన్న నటి కాబట్టి ఆమెకు మంచి కమ్‌బ్యాక్ లభిస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# టైటిల్‌కు చేరువలో వైశాలి

పాఫోస్ (సైప్రస్): క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేస్తున్న వైశాలి టైటిల్‌కు చేరువైంది. అగ్రస్థానంలో ఉన్న ఆమె ఆఖరి రౌండ్లో నెగ్గితే.. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం పోటీపడే అవకాశం లభిస్తుంది. కాకపోతే 7.5 పాయింట్లతో ఆమెతో సమానంగా ఉన్న బిబిసారా (కజకిస్థాన్) ఓడిపోవాలి లేదా డ్రా చేసుకోవాలి. వైశాలి అవకాశాలు భారత స్టార్, ప్రపంచ కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్‌పై ఆధారపడివున్నాయి. ఎందుకంటే ఆఖరి గేమ్‌లో బిబిసారాను ఢీకొనేది దివ్యనే. వైశాలి తన ఆఖరి గేమ్‌లో కేథరినాతో ఆడనుంది. పదమూడో రౌండ్లో టాన్ జోంగ్‌యి (చైనా)తో గేమ్‌ను వైశాలి డ్రా చేసుకుంది. అనా ముజ్‌చుక్ (ఉక్రెయిన్)పై బిబిసారా విజయం సాధించింది. దివ్య దేశ్‌ముఖ్ (5).. కేథరినా (రష్యా) చేతిలో ఓడిపోయి, అట్టడుగున ఉంది. ఓపెన్ విభాగంలో కరువానా (అమెరికా)తో గేమ్‌లో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకున్నాడు. ప్రజ్ఞా (5.5 పాయింట్లు) వీ యి (చైనా)తో ఉమ్మడిగా అయిదో స్థానంలో ఉన్నాడు. ఇప్పటికే టైటిల్ ఖాయం చేసుకున్న జవోకిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్).. 13వ రౌండ్లో అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. రెండో స్థానంలో ఉన్న అనీష్ (7.5) కంటే సిందరోవ్ (9.5) రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. ఈ ఏడాది ఆఖర్లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం అతడు భారత ఆటగాడు దొమ్మరాజు గుకేశ్‌ను ఢీకొననున్నాడు.

# కోల్‌కతా చిత్తు.. చెన్నై విక్టరీ





**చెన్నై**

**సొంతగడ్డపై చెన్నై అదరగొట్టింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 32 పరుగుల తేడాతో కోల్‌కతాను ఓడించింది. మొదట సంజు శాంసన్ (48; 32 బంతుల్లో 4×4, 3×6), డెవాల్డ్ బ్రెవిస్ (41; 29 బంతుల్లో 4×4, 2×6), ఆయుష్ మాత్రే (39; 17 బంతుల్లో 6×4, 2×6) రాణించడంతో చెన్నై 5 వికెట్లకు 192 పరుగులు చేసింది. కోల్‌కతా బౌలర్లలో కార్తీక్ త్యాగి (2/35), సునీల్ నరైన్ (1/21) రాణించారు. అనంతరం నూర్ అహ్మద్ (3/21) విజృంభించడంతో కేకేఆర్ 7 వికెట్లకు 160 పరుగులే చేయగలిగింది. అన్షుల్ కాంబోజ్ (2/32), ఖలీల్ అహ్మద్ (1/24), అకీల్ హొసీన్ (1/26) కూడా చక్కగా బౌలింగ్ చేశారు. రమణ్‌దీప్ సింగ్ (35; 23 బంతుల్లో 4×4, 1×6) టాప్‌స్కోరర్.**

**పోటీలోనే లేదు:** ఈ ఐపీఎల్‌లో 200 పైచిలుకు లక్ష్యాలను కూడా అలవోకగా ఛేదించేస్తున్న నేపథ్యంలో 193 పరుగులను చెన్నై కాపాడుకోగలదా అనుకుంటే.. కోల్‌కతాను అసలు పోటీలో లేకుండా చేశారు ఆ జట్టు బౌలర్లు. మ్యాచ్ సాగేకొద్దీ నెమ్మదించిన చెపాక్ పిచ్‌పై కోల్‌కతా బ్యాటర్లు పరుగులు చేయడానికి ఆపసోపాలు పడ్డారు. ఎన్నో అంచనాల మధ్య ఈ సీజన్లో అడుగుపెట్టి వరుసగా విఫలమవుతున్న ఫిన్ అలెన్ (1) మరోసారి పేలవ ప్రదర్శన చేశాడు. కాంబోజ్ అతణ్ని ఔట్ చేసి చెన్నైకి శుభారంభాన్నిచ్చాడు. రహానె మూడో స్థానానికి దిగి, నరైన్ (24; 17 బంతుల్లో 2×4, 2×6)ను ఓపెనర్‌గా పంపగా.. అతను ఉన్నంతసేపు ధాటిగానే ఆడాడు. రహానె (28; 22 బంతుల్లో 2×6), రఘువంశీ (27; 19 బంతుల్లో 3×4, 1×6) ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తెచ్చినా.. సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులోకి తేలేకపోయారు. స్కోరు పెంచే ప్రయత్నంలో రఘువంశీ ఔటైపోయాడు. రహానె, గ్రీన్ (0)లను వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చిన నూర్ అహ్మద్.. రింకు సింగ్ (6)ను కూడా ఔట్ చేసి కోల్‌కతాకు దారులు మూసేశాడు. రోమన్ పావెల్ (31; 22 బంతుల్లో 1×4, 2×6), రమణ్‌దీప్ పోరాడి తమ జట్టుకు కాస్త గౌరవప్రదంగా ఓడే అవకాశమిచ్చారు.

**మెరిసిన ఆ ముగ్గురూ..:** మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన చెన్నైకి ఆశించిన ఆరంభం దక్కకపోయినా.. ముగింపులోనూ ఆ జట్టు పేలవంగా ఆడినా.. ప్రత్యర్థికి పెద్ద లక్ష్యాన్నే నిలపగలిగింది. జట్టులో అర్ధశతకం నమోదు కాకపోయినప్పటికీ.. సంజు శాంసన్, ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్ సమయోచితంగా ఆడి జట్టుకు మెరుగైన స్కోరును సాధించి పెట్టారు. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ కెప్టెన్ రుతురాజ్ (7) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా.. గత మ్యాచ్ సెంచరీ హీరో సంజు, మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఓవర్లోనే మూడు ఫోర్లతో జోరందుకున్న అతను.. తర్వాత కూడా నిలకడగా బ్యాటింగ్ చేశాడు. మరో ఎండ్‌లో యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకుంటూ చూడముచ్చటైన షాట్లతో అలరించాడు. దీంతో చెన్నై తొలి 6 ఓవర్లలోనే 72 పరుగులు రాబట్టింది. అయితే పవర్ ప్లే చివరి బంతికి మాత్రే ఔటైపోయాడు. తర్వాత సంజు, బ్రెవిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. తన బౌలింగ్‌లో ఒక సిక్సర్ బాది 48 మీదికి వచ్చిన సంజును కార్తీక్ త్యాగి అద్భుతమైన బంతితో బౌల్డ్ చేయగా.. ఆపై బ్రెవిస్‌కు సర్ఫరాజ్ (23) తోడవడంతో సీఎస్కే పటిష్ఠ స్థితికి చేరుకుంది. కుదురుకున్నాక ఇద్దరూ భారీ షాట్లు ఆడడంతో 16 ఓవర్లకు స్కోరు 162కు చేరుకుంది. అయితే ఆఖరి 4 ఓవర్లలో వేగంగా ఆడలేకపోయిన చెన్నై 30 పరుగులే చేయగలిగింది. సర్ఫరాజ్, బ్రెవిస్ వరుస ఓవర్లలో వెనుదిరగ్గా.. నెమ్మదించిన పిచ్‌పై దూబె (13 నాటౌట్), ఓవర్టన్ (7 నాటౌట్) షాట్లు కొట్టలేకపోయారు.

### స్కోరు వివరాలు

**చెన్నై ఇన్నింగ్స్:** సంజు (బి) కార్తీక్ త్యాగి 48; రుతురాజ్ (సి) రోమన్ పావెల్ (బి) అనుకుల్ 7; ఆయుష్ మాత్రే (సి) రమణ్‌దీప్ (బి) వైభవ్ అరోరా 38; బ్రెవిస్ (సి) వైభవ్ అరోరా (బి) కార్తీక్ త్యాగి 41; సర్ఫరాజ్ (బి) నరైన్ 23; శివమ్ దూబె నాటౌట్ 13; ఓవర్టన్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 15 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 192; వికెట్ల పతనం: 125, 272, 3111, 4162, 5171; బౌలింగ్: వైభవ్ అరోరా 40551; కామెరూన్ గ్రీన్ 20300; అనుకుల్ రాయ్ 30211; సునీల్ నరైన్ 40211; వరుణ్ చక్రవర్తి 30260; కార్తీక్ త్యాగి 40352

**కోల్‌కతా ఇన్నింగ్స్:** ఫిన్ అలెన్ (సి) దూబె (బి) కాంబోజ్ 1; నరైన్ (సి) గుర్జన్‌ప్రీత్ (బి) ఖలీల్ 24; రహానె (సి) రుతురాజ్ (బి) నూర్ 28; రఘువంశీ (సి) బ్రెవిస్ (బి) హొసీన్ 27; రింకు సింగ్ (సి) దూబె (బి) నూర్ 6; గ్రీన్ (బి) నూర్ 0; రోమన్ పావెల్ నాటౌట్ 31; రమణ్‌దీప్ (సి) సర్ఫరాజ్ (బి) కాంబోజ్ 35; అనుకుల్ రాయ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 160; వికెట్ల పతనం: 113, 229, 379, 485, 585, 690, 7153; బౌలింగ్: ఖలీల్ 3.50241; కాంబోజ్ 40322; అకీల్ 40261; నూర్ 40213; గుర్జన్‌ప్రీత్ 1.10230; ఓవర్టన్ 30320

### నూర్ అహ్మద్ విజృంభణ

హ్యాట్రిక్ ఓటములతో ఐపీఎల్19ను పేలవంగా ఆరంభించిన చెన్నై సూపర్‌కింగ్స్.. కొంచెం ఆలస్యంగా జోరందుకుంది. గత మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్‌ను మట్టికరిపించిన సీఎస్కే.. మంగళవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై అలవోకగా గెలిచింది. బ్యాటింగ్ కొంచెం కష్టంగా సాగిన చెపాక్ స్టేడియంలో బ్యాటర్ల సమష్టి ప్రదర్శనతో 192 పరుగులు చేసిన చెన్నై.. ప్రత్యర్థిని 160/7కే కట్టడి చేసింది. స్పిన్నర్ నూర్ అహ్మద్ కోల్‌కతా పతనాన్ని శాసించాడు. వర్షం వల్ల ఖాతాలో చేరిన ఒక్క పాయింట్ మినహాయిస్తే.. అయిదో మ్యాచ్‌లోనూ కేకేఆర్ సొంతంగా పాయింట్ సాధించలేకపోయింది.

# అదే జరిగితే..

## వైభవ్ సూర్యవంశీదే కొత్త చరిత్ర



యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ చరిత్ర పుటల్లో నిలిచే రోజు చేరువలోనే ఉంది. భారత్ తరఫున జట్టులోకి అరంగేట్రం చేసే అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఈ ఘనత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ (16 ఏళ్లు) పేరిట ఉంది. ఇకనుంచి వైభవ్ సూర్యవంశీదే కావచ్చు. అలా జరగాలంటే.. మాత్రం టీమ్‌ఇండియా తరఫున బరిలోకి దిగాల్సి ఉంటుంది. అయితే, క్రికెట్ వర్గాల తాజా కథనాల ప్రకారం.. రాబోయే ఐర్లాండ్ సిరీస్‌తో వైభవ్ జాతీయజట్టుకు ఆడటం ఖాయమేనని తెలుస్తోంది. ఇప్పటికే బీసీసీఐ సెలక్షన్ కమిటీ షార్ట్ లిస్ట్ చేసిన జాబితాలో వైభవ్ (Vaibhav Sooryavanshi) పేరు ఉన్నట్లు సమాచారం. ఈ 15 ఏళ్ల సంచలన ప్లేయర్ ఇప్పటికే ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. ప్రస్తుత సీజన్‌లో హైదరాబాద్‌పై తప్ప.. మిగతా నాలుగు మ్యాచుల్లోను దూకుడుగా ఆడేశాడు.

**జూన్‌లో ఐర్లాండ్‌తో సిరీస్..**

ఐపీఎల్ ముగిసిన కొన్ని రోజులకే టీమ్‌ఇండియా ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇప్పటికే షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించింది. గత కొన్ని రోజులుగా వైభవ్‌ను జాతీయజట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు పెరిగిపోయాయి. ఐర్లాండ్‌తో సిరీస్ కోసం ఇంకా జట్టును ప్రకటించలేదు. అందుకోసం తీసిన షార్ట్‌లిస్ట్‌లో వైభవ్‌కు చోటు దక్కినట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ‘‘ఐర్లాండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టులో వైభవ్‌కు చోటు ఖాయమే. సెలక్టర్లు కూడా అతడి ఆటతీరుపై సంతృప్తిగా ఉన్నారు. ఇటీవలే 15 ఏళ్ల నిబంధన నుంచి వైభవ్ బయటపడ్డాడు. ఎమర్జింగ్ ఆసియా కప్‌లో అతడి ఆటను అందరూ చూశారు’’ అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఐర్లాండ్‌లో మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తే.. జింబాబ్వేతో సిరీస్‌కూ ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. బీసీసీఐ ట్రెజరర్, ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా ఇటీవల వైభవ్‌ను జాతీయజట్టులోకి తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే.

# సూర్యకుమార్ యాదవ్‌పై వేటు!



టీమిండియాకు టీ20 ప్రపంచకప్ అందించిన కెప్టెన్‌గా భారత క్రికెట్ చరిత్ర పుటల్లో తన పేరును లిఖించుకున్నాడు సూర్యకుమార్ యాదవ్. సొంతగడ్డపై అతడి సారథ్యంలో ఈ ఏడాది భారత్ వరల్డ్‌కప్ ట్రోఫీని ముద్దాడింది. తద్వారా మొత్తంగా మూడుసార్లు.. వరుసగా రెండుసార్లు.. స్వదేశంలో తొలిసారి పొట్టి క్రికెట్ వరల్డ్‌కప్ గెలిచిన తొలి జట్టుగా నిలిచింది.

**ఒలింపిక్స్2028లో ఆడటమే లక్ష్యం**

ఇక ఈ టోర్నీకి ఆరంభం ముందు నుంచే సూర్యకుమార్ యాదవ్ (Suryakumar Yadav) కెప్టెన్సీ గురించి వదంతులు వ్యాపించిన సంగతి తెలిసిందే. సారథిగా టీమిండియాకు తిరుగులేని విజయాలు అందించినప్పటికీ.. బ్యాటర్‌గా అతడి ప్రదర్శన దిగజారడం ఇందుకు కారణం. అయితే, సూర్య వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ కావడంతో ఇక అతడికి తిరుగులేదని అభిమానులు భావిస్తున్నారు. సూర్య సైతం తాను ఇప్పట్లో రిటైర్ కాబోనని.. ఒలింపిక్స్2028లో ఆడటమే లక్ష్యమని తెలిపాడు. అయితే, టీమిండియా యాజమాన్యం ప్రణాళికలు మాత్రం వేరుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సూర్యను కెప్టెన్‌గా తప్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. స్ట్రైక్‌రేటు మరీ దారుణం కాగా ఒకప్పుడు ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా కొనసాగిన సూర్యకుమార్.. కెప్టెన్సీ చేపట్టిన తర్వాత ఆటగాడిగా విఫలమవుతున్నాడు. గతేడాది అతడి స్ట్రైక్‌రేటు మరీ దారుణంగా 120లోపు పడిపోగా.. ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు.

ఇక 2026లో మొత్తంగా నాలుగు అర్ధ శతకాలు బాదిన సూర్య.. టీ20 ప్రపంచకప్‌లో అమెరికాపై సత్తా చాటాడు. అయితే పెద్ద జట్లైన సౌతాఫ్రికాపై 18, వెస్టిండీస్‌పై 18, సెమీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 11, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 0 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచాడు.

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఐపీఎల్2026తో బిజీగా ఉన్న టీమిండియా ఆటగాళ్లు.. తదుపరి పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేందుకు ఇంగ్లండ్‌కు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌లో సూర్య బ్యాటింగ్ ప్రదర్శనపైనే అతడి భవితవ్యం ఆధారపడి ఉందని తెలుస్తోంది.

**ఇంగ్లండ్‌లో విఫలమతే అంతే సంగతులు**

ఈ విషయం గురించి బీసీసీఐ వర్గాలు PTIతో మాట్లాడుతూ.. ‘‘సూర్యనే కెప్టెన్. అయితే, బ్యాటర్‌గా అతడు నిలకడగా రాణించాల్సి ఉంది. ఈ విషయంలో సెలక్టర్లకు నమ్మకం కలిగించాలి. ఇంగ్లండ్ టూర్‌లో అతడే కెప్టెన్. అయితే, 2028 నాటికి అతడు జట్టుతో కొనసాగాలంటే కచ్చితంగా మంచి ప్రదర్శనలు ఇవ్వాల్సిందే’’ అని పేర్కొన్నాయి. కాగా వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మాత్రే వంటి చిచ్చరపిడుగులు టీమిండియా టీ20 జట్టు వైపు దూసుకువస్తున్నారు. వీరితో పాటు ఇప్పటికే ఎంతో మంది తమను తాము నిరూపించుకున్నారు.

ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్ ఇటు కెప్టెన్‌గా.. అటు బ్యాటర్‌గా టీ20 ఫార్మాట్లో దుమ్ములేపుతున్నాడు. ఇలాంటి తరుణంలో సూర్య ఇకనైనా తన బ్యాటింగ్‌పై మరింతగా దృష్టి పెడితేనే జట్టులో కొనసాగే అవకాశం ఉంటుంది.

# హైదరాబాద్‌కు గుడ్‌న్యూస్.. కమిన్స్ వచ్చేదప్పుడే..!



సొంతమైదానంలో రాజస్థాన్ రాయల్స్‌పై ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసి, ఊపు మీద ఉంది సన్‌రైజర్స్. ఇప్పుడు ఆ జట్టు అభిమానులకు గుడ్‌న్యూస్..! అరంగేట్ర బౌలర్లు ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ మెరుపులకు మరింత బలం చేకూరనుంది. అగ్రశ్రేణి బౌలర్ పాట్ కమిన్స్ (Pat Cummins) ఏప్రిల్ 17న జట్టుతో చేరనున్నాడని తెలుస్తోంది.

గాయం కారణంగా కమిన్స్ ఈ ఐపీఎల్ సీజన్‌లోకి అడుగుపెట్టలేదు. బుధవారం ఆస్ట్రేలియాలో కమిన్స్‌కు ఫిట్‌నెస్ పరీక్ష జరగనుంది. అందులో నెగ్గితే ఎస్‌ఆర్‌హెచ్‌తో చేరడం ఖాయం. ప్రారంభ మ్యాచ్‌లకు దూరమైనా కోలుకొని కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. తన కెప్టెన్సీలో 2024లో హైదరాబాద్‌ను ఫైనల్‌కు చేర్చాడు.

కమిన్స్ దూరం కావడంతో ప్రస్తుతం ఎస్‌ఆర్‌హెచ్‌ను యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ నడిపిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ఈ జట్టు.. రెండింటిలో విజయం సాధించింది. సోమవారం ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ చిరస్మరణీయ బౌలింగ్‌తో సన్‌రైజర్స్ 57 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను చిత్తుచేసింది. ఇషాన్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతున్నాడు.

# ఆయుష్ అదరహో..



భారత బ్యాడ్మింటన్ వర్గాల్లో ఇప్పుడు చర్చంతా 20 ఏళ్ల ఆయుష్ గురించే. ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో గత 61 ఏళ్లలో ఫైనల్ చేరిన తొలి భారతీయుడిగా అతడు చరిత్ర సృష్టించాడు. ఫైనల్ చేరే క్రమంలో పలు సంచలనాలను సృష్టించాడు. వితిద్‌సర్న్, జోనాథన్ క్రిస్టీ, లి షి ఫెంగ్ వంటి ఆటగాళ్లను అతడు మట్టికరిపించాడు. చక్కని డ్రాప్స్, నెట్‌ప్లే, బలమైన స్మాష్‌లతో ఆకట్టుకున్నాడు. తన సంయమనం, వ్యూహాత్మక ఆట, దూకుడుతో తాను అగ్రశ్రేణి ఆటగాళ్ల కోవకు చెందుతానని చాటుకున్నాడు. ఫైనల్లో ఓడిపోయినా.. ప్రణయ్ (2018) తర్వాత ఆసియా బ్యాడ్మింటన్‌లో పోడియం ఫినిష్ చేసిన తొలి భారత షట్లర్‌గా ఆయుష్ ఘనత సాధించాడు.

**వచ్చాడిలా..:** కర్ణాటకలోని సనూర్‌కు చెందిన ఆయుష్.. ఎనిమిదేళ్ల వయసులో బ్యాడ్మింటన్ రాకెట్ అందుకున్నాడు. తండ్రే తొలి గురువు. పెరట్లోనే శిక్షణ. అది సరదాగానే. కానీ అతడిలో ప్రతిభను గుర్తించిన కుటుంబం మెరుగైన శిక్షణ కోసం బెంగళూరుకు మకాం మార్చింది. ప్రకాశ్ పదుకొనె బ్యాడ్మింటన్ అకాడమీలో నిపుణులైన కోచ్‌లు ఆయుష్ నైపుణ్యానికి సానపట్టారు. కదలికలు మెరుగుపరుచుకుని, దూకుడు పెంచుకున్న అతడు.. ఆటలో ఎంతో ఎదిగాడు. జూనియర్ స్థాయిలో సత్తాచాటాడు. 2021లో డెన్మార్క్ జూనియర్ ఇంటర్నేషనల్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 2023 ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్‌లో కాంస్య పతకంతో మెరిశాడు. ఒడిశా మాస్టర్స్ సూపర్ 100 (2023), బహ్రెయిన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ (2023), డచ్ ఓపెన్ (2024)లో ఫైనల్‌కు చేరుకున్నాడు. సీనియర్ స్థాయిలోనూ అదే జోరు కొనసాగిస్తూ రోజు రోజుకూ ఎదిగిపోతున్నాడు. అతడి కెరీర్‌కు మలుపు నిరుడు యుఎస్ ఓపెన్ టైటిల్ గెలవడమే. ఇప్పుడు ఆసియా బ్యాడ్మింటన్‌లో ముగ్గురు టాప్10 ఆటగాళ్లను ఓడించడం అతడి ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుతుందనడంలో సందేహం లేదు. తన వయసుకు మించిన పరిణతిని ప్రదర్శిస్తూ ఒత్తిడిలోనూ ఎంతో సంయమనంగా ఆడే ఆయుష్.. భారత బ్యాడ్మింటన్ భవిష్యత్తుకు భరోసా ఇస్తున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో అతడు తొలిసారి టాప్20కి దూసుకెళ్లాడు. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అతడు ఏడు స్థానాలు ఎగబాకి 18వ స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది ఇంకా థామస్ కప్, స్వదేశంలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటడానికి సిద్ధమవుతున్నాడు అయుష్.